
మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఉదయ్‌కిరణ్

## బీఆర్ఎస్ గెలుపు ఖాయం

**పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అంబాల ఉదయ్‌కిరణ్**

కరీమాబాద్, డిసెంబర్ 1 : తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అంబాల ఉదయ్‌కిరణ్ తెలిపారు. శుక్రవారం మామునూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో ఉన్నాయన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల వైపే ప్రజలు మొగ్గు చూపారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారం చేపడుతుందన్నారు. భారీ మెజార్టీతో వర్ధన్నపేటలో ఎమ్మెల్యే అరూరి రమేశ్ మూడోసారి విజయం ఖాయమన్నారు. కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినా తమకు అండగా నిలిచిన సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఫలితాల్లో కారు జోరు కనబడబోతుందన్నారు. జమీరొద్దీన్, కుమార్ పాల్గొన్నారు.

## 'బీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు'

హసన్‌పర్తి, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోసం గత నెల రోజులుగా అహర్నిశలు పని చేసిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు, ప్రజాప్రతినిధులకు బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు బండి రజనీకుమార్ శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలుగా ఈ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు కృషిచేసిన కార్యకర్తలను అభినందించారు.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దామెర, డిసెంబర్ 1 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కాగితాల శంకర్ శుక్రవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ఈ సర్వసభ్య సమావేశంలో మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరుగుతుందన్నారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఎంపీటీసీలు, సర్పంచులు, కో-ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

డోర్నకల్, డిసెంబర్ 1: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ సీసీ రాధ అన్నారు. శుక్రవారం బంజర గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీసీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,183 మద్దతు ధర కల్పిస్తుందని తెలిపారు. హరీశ్, రైతులు పాల్గొన్నారు.

# డోర్నకల్ నియోజకవర్గంలో భారీగా పోలింగ్

- ఓటుహక్కు వినియోగించుకున్న 1,92,365 మంది ఓటర్లు
- పురుషుల కంటే మహిళలే అధికం
- గెలుపుపై ఎవరి లెక్కలు వారివే..



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

నర్సింహులపేట, డిసెంబర్ 1: డోర్నకల్ నియోజకవర్గ వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 2,19,264 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,08,210 మంది పురుషులు, 1,01,146 మంది మహిళలు ఉన్నారు. గురువారం జరిగిన శాసనసభ ఎన్నికల్లో పురుషులు 95,622 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 96,743 మంది మహిళలు ఓటు వేశారు. పురుషులకంటే మహిళలు 1,121 ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 87.73 శాతం ఓటింగ్ నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక వెల్లడించారు. 2019 ఎన్నికల్లో 50.73 శాతం బీఆర్ఎస్ అభ్యర్థి ధరంసోత్ రెడ్యానాయక్‌కు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి రామచంద్రునాయక్‌కు 40.74 శాతం, ఇతరులకు 4.75శాతం ఓట్లు, నియోజకవర్గ వ్యాప్తంగా 88.96 శాతం ఓట్లు పోలయ్యాయి. గతంలో జరిగిన ఓట్లతో పోలిస్తే 1.23 శాతం ఓటింగ్ శాతం తగ్గింది. మరిపెడ మండలంలో అత్యధికంగా ఓట్లు ఉండగా, 57,063 వేలు పోలయ్యాయి. అతి తక్కువగా నూతనంగా ఏర్పాటైన చిన్నగూడూరు మండలంలో 12,329 పడ్డాయి. 2019 ఎన్నికల్లో మరిపెడ మండలం 12 వేలు, అత్యధికంగా బీఆర్ఎస్‌కు మెజార్టీ, కురవి మండలంలో 4,682 మెజార్టీ, డోర్నకల్‌లో బీఆర్ఎస్‌కు తక్కువగా 2,600, దంతాలపల్లి 2,400, నర్సింహులపేట 2,250, చిన్నగూడూరులో తక్కువ పడ్డాయి. మారిన ఎన్నికల పరిణామాల ప్రకారం నియోజకవర్గంలో ఓటు శాతం తగ్గడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో ఓటరు దేవుళ్లు ఎవరి వైపు ఉన్నారనే విషయంపై వివిధ పార్టీలు బేరీజు వేసుకుంటున్నాయి. బీజేపీ మాత్రం అంతంత మాత్రంగానే పోటీలో ఉన్నట్లు కనిపించింది. ఆదివారం వెలువడే ఫలితాల్లో ఓటర్లు ఎవరివైపు ఉన్నారనే విషయం తెలియనున్నది. ఇప్పటికే మండలాల్లో వివిధ పార్టీల మధ్య బెట్టింగ్‌లు సైతం జరుగుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

**కేసముద్రంలో గ్రామాల వారీగా పోలైన ఓట్లు**

కేసముద్రం: మండలంలో మొత్తం 47,083 ఓటర్లుండగా వీరిలో పురుషులు 23,464 మంది, మహిళలు 23, 616 మంది ఉన్నారు. 39,921 ఓట్లు నమోదు కాగా, మండలంలో 80.07 శాతం మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# తొర్రూరు మండలంలో 80.91శాతం..

**66, 285 ఓట్లకు 53,633 ఓట్లు నమోదు**

తొర్రూరు, డిసెంబర్ 1: పాలకుర్తి నియోజకవర్గంలో నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో తొర్రూరు మండలంలో 80.91శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మండల వ్యాప్తంగా మొత్తం 66,285 మంది ఓటర్లు ఉండగా, 53,633 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 80.91శాతం పోలింగ్ నమోదైంది. తొర్రూరు మున్సిపాలిటీలో 20,945 మంది ఓటర్లుండగా 14,683 మంది ఓటు హక్కు వినియోగించుకునారు. 70.10 శాతం పోలింగ్ నమోదైంది. నాంచారిమడూర్‌లో 2,981 ఓటర్లుండగా 2,546 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. 85.40 శాతం ఓటింగ్ నమోదైంది. కర్కాలలో 781 ఓట్లకు 702 ఓట్లు వేయగా, 89.88 శాతం, హరిపిరాలలో 3,257 ఓట్లు ఉండగా, 2,704 ఓట్లు పోల్ కావడంతో 83.02శాతం, అమర్‌సింగ్ తండాలో 1,385 ఓటర్లు ఉండగా 1289 ఓట్లు పోల్ కావడంతో 93 శాతం, వెంకటాపురంలో 1,373 ఓట్లు ఉండగా 1,255 ఓట్లు పోల్ అవగా 91.40 శాతం, వెలికట్ట, శివారు తండా పంచాయతీల్లో కలిపి 4,325 ఓట్లు ఉండగా 3,987 ఓట్లు పోల్ కావడంతో 82.63 శాతం ఓటింగ్ నమోదైంది. సోమారంలో 1,889 ఓట్లుండగా 1,702 ఓట్లు పోల్ అవగా 90.10 శాతం, జమస్తాన్‌పూరంలో 445 ఓట్లకు 404 ఓట్లు పోల్ కావడంతో 90.78 శాతం, గుర్తూరులో 2,385 ఓట్లకు 2,125 పోల్ కాగా, 89.09 శాతం, ఖానాపురంలో 886 ఓట్లకు 826 ఓట్లు పోల్ కావడంతో 93.22శాతం ఓటింగ్ నమోదైంది. అమ్మాపురంలో 4,955 ఓట్లకు 4044 ఓట్లు పోల్ కావడంతో 81.61 శాతం ఓటింగ్, జీకే తండాలో 507 ఓట్లకు 470 ఓట్లు పోల్ కావడంతో 92.70 శాతం, కంఠాయపాలెంలో 2,911 ఓట్లకు 2,462 ఓట్లు పోల్ అవగా 94.57 శాతం, చింతలపల్లిలో 1,119 ఓట్లకు 919 ఓట్లు పోల్ కావడంతో 82.12,శాతం, హచ్చుతండాలో 876 ఓట్లకు 754 పోల్ కావడంతో 86.07,శాతం, కొమ్మనపల్లిలో 626 ఓట్లకు 572 పోల్ కాగా, 91.37 శాతం, మడిపల్లి, శివారు తండాల్లో కలిపి 3,205 ఓట్లు ఉండగా 2677 ఓట్లు పోల్ కావడంతో 83.52 శాతం, పోలెపల్లిలో 1,263 ఓట్లకు 1,148 పోల్ కావడంతో 90.82శాతం, ఫత్తేపురంలో 2076 ఓట్లకు 1,787 ఓట్లు పోల్‌కావడంతో 86.12 శాతం, చీకటాయపాలెంలో 1,744 ఓట్లకు 1600 ఓట్లు పోల్ అవగా 91.74 శాతం, చెర్లపాలెం, గోపాలగిరి గ్రామాల్లో కలిపి 2,741 ఓట్లు ఉండగా 2,360 ఓట్లు పోల్ కావడంతో 86.09శాతం, మాటేడు, కిష్టాపురం, శివారు తండాలు కలిపి 3,110 మంది ఓటర్లు ఉండగా 2,616 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. 84.11 శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలో ఎక్కడ కూడా రీపోలింగ్‌కు అవకాశం లేదని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

## పోలీస్ కిష్టయ్యకు నివాళి


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ నాయకులు

చిల్పూరు, డిసెంబర్ 1 : మండలంలోని చిన్నపెండ్యాలలో శుక్రవారం తెలంగాణ మలిదశ పోరాట అమరుడు పుట్టకొక్కుల కృష్ణయ్య ముదిరాజ్ (పోలీస్ కిష్టయ్య) 14వ వర్ధంతి నిర్వహించారు. ముదిరాజ్ కమ్యూనిటీ భవనంలో కిష్టయ్య చిత్రపటానికి జిల్లా ఫిషరీస్ చైర్మన్ నీల రాజు ముదిరాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాగ నాగేశ్వర్, ఈర్ల రాజు, పుప్పాల రవికుమార్, శాగ గోపాల్, లక్ష్మీనారాయణ, శాగ నాగేశ్, ఈర్ల పోమయ్య, తంగళ్లపల్లి కుమార్, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం..

చిల్పూరు, డిసెంబర్ 1 : మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన శనిగరం కొమురయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. మృతదేహానికి చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వే ల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, ఉప సర్పంచ్ బత్తిని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పేరాల సుధాకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బత్తిని రాజ్ గౌడ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గట్టయ్య, మార్కెట్ డైరెక్టర్ శ్యామ్‌సుందర్ రెడ్డి, దేవస్థానం డైరెక్టర్ సంపత్‌రాజ్, మాజీ ఉప సర్పం చ్ బొట్టు చేరాలు, నాయకులు జీడి ఆనందం, చొక్కయ్య, యాదగిరి, తిరుమల్ పాల్గొన్నారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీధర్‌రావు

## 'పల్లా' గెలుపు ఖాయం..

- నక్కపిట్టల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిట్టిబాబు
- ప్రతి ఇంటికి చేరిన కేసీఆర్ సంక్షేమ పథకాలు

బచ్చన్నపేట, డిసెంబర్ 1 : రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో పాటు జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడం ఖాయమని నక్కపిట్టల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వీవ స్నార్ నగర్ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కాలియ చిట్టిబాబు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని దానికి ప్రతిఫలంగా ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌ను ఆదరించారన్నారు. కాంగ్రెస్ పగటి కలలు కంటుందన్నారు. సర్వేలు అనేకసార్లు తారుమారయ్యాయన్నారు. డిసెంబర్ 3న గజ్వేల్, కామారెడ్డిలో కేసీఆర్, జనగామలో పల్లా విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజేశ్వర్‌రెడ్డి సేవలు జనగామకు అవసరమని ప్రజలు గుర్తించారన్నారు. అందుకే ఆయన విజయం ఖాయమై పోయిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్, చెన్నూరి రవీందర్, అంజయ్య పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మాక్ పోలింగ్

డోర్నకల్, డిసెంబర్ 1: మండలంలోని పెరుమాండ్ల సంకీస గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు బట్టు శంకర్, పీఈటీ మాధవి ఆధ్వర్యంలో పోలింగ్ జరిపారు. విద్యార్థులు నజీమా, యాకూబ్ పాషా, సౌందర్యను అభ్యర్థులుగా నిలబెట్టి గుర్తులను కేటాయించి ఎన్నికలను నిర్వహించారు. పీవో హరీశ్‌బాబు, ఏపీవో ఐశ్వర్య, వోపీవో నస్రీన్ రుక్సానా, ఏజెంట్లుగా సౌందర్య, సంజన, అనిత, సైదులు వ్యవహరించారు. విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన పెంపొందించేందుకు పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

## ఇద్దరి మధ్య ఘర్షణ

పోచమ్మమైదాన్, డిసెంబర్ 1: మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధి హంటర్ రోడ్డులో శుక్రవారం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కరీమాబాద్‌కు చెందిన శ్రీనివాస్, సందీప్ హంటర్‌రోడ్డులోని మేఘన బార్ సమీపంలో మద్యం మైకంలో ఘర్షణకు దిగారు. గురువారం ఎన్నికల సందర్భంగా డబ్బులను తమ గల్లీలో ఎందుకు పంచలేదని ఇద్దరు ఘర్షణ పడ్డారు. వారిలో ఒకరు కింద పడేయగా, మరొకరు కత్తితో గాయపర్చాడు. దీంతో ఇద్దరికి గాయాలు కాగా చికిత్స కోసం ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై ఇరువురు మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# 'బాలల అక్రమ రవాణా సామాజిక నేరం'

నెక్కొండ, డిసెంబర్ 1: మానవ, బాలల అక్రమ రవాణా సామాజిక నేరమని ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ ఫీల్డ్ కో ఆర్డినేటర్ బెజ్జంకి ప్రభాకర్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు, ప్రజలకు మానవ, బాలల అక్రమ రవాణాపై కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలు అపరిచితులు చెప్పే మాయమాటలకు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారు ఇచ్చే తినుబండారాలను స్వీకరించొద్దని చెప్పారు. అపరిచిత వ్యక్తుల ప్రవర్తనపై ఏ మాత్రం అనుమానం కలిగినా వెంటనే 1098కు, మహిళలైతే పోలీస్ 100డయల్ చేసి రక్షణ పొందాలన్నారు.